కలెక్టరేట్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

వ్యర్థాలను స్క్రాప్ డీలర్లకు విక్రయించాలి

కలెక్టర్ సత్యశారద

ఖిలావరంగల్, జనవరి 4: వేరు చేసిన తడి, పొడి చెత్తతోపాటు ప్లాస్టిక్ వ్యర్థాలను గ్రామస్థాయి నుంచే సేకరించి స్క్రాప్ డీలర్లకు విక్రయించాలని కలెక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం ఆమె స్వచ్ఛ భారత్ మిషన్‌పై సమీక్షించారు. ఓడీఎఫ్ అమల్లో జిల్లాను ముందు వరుసలో ఉంచాలన్నారు. ఇంటి నుంచి వచ్చే మురుగు నీటిని ఫిల్టరేషన్ ద్వారా పరిష్కరించాలన్నారు. డ్రైనేజీ చివరలో ఫిల్టరేషన్ నిర్మించేందుకు పైలట్ ప్రాజెక్టుగా చిన్న గ్రామాన్ని ఎంపిక చేయాలని ఆమె అధికారులకు సూచించారు. స్వచ్ఛ భారత్ మిషన్ గ్రామీణ కార్యక్రమంపై విస్తృత ప్రచారం చేసి గ్రామాలు, మండలాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని ఆదేశించారు. అలా గే, వరంగల్ డివిజన్‌లోని గీసుగొండ, సంగెం, పర్వతగిరి, నర్సంపేట డివిజన్‌లోని నెక్కొండ మండలాల మీదుగా వేసే నేషనల్ హైవే సర్వే పనులు నెల రోజుల్లో పూర్తి చేయాలని తహసీల్దార్లను ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్డీవో కౌసల్యా దేవి, జడ్పీ సీఈవో రాంరెడ్డి పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణ చర్యలు

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు జిల్లా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టిందని కలెక్టర్ అన్నారు. రోడ్డు భద్రత ప్రమాణాల అవగాహనపై జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జిల్లాలో ప్రజలకు రహదారి భద్రతపై అవగాహన కల్పిస్తున్నామని కలెక్టర్ అన్నారు. అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీటీవో లక్ష్మి పాల్గొన్నారు. కాగా, నిర్లక్ష్యంగా సమాధానం చెప్పి కలెక్టరేట్ నుంచి వెళ్లిపోయిన జిల్లా రవాణా శాఖ అధికారికి కలెక్టర్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. మంత్రి వీడియో కాన్ఫరెన్స్ జరుగుతుండగా, జిల్లాలో జాతీయ భద్రతా మాసోత్సవాల నిర్వహణ సరిగా లేదని కలెక్టర్ డీటీవో లక్ష్మిని ప్రశ్నించినట్లు తెలిసింది. దీంతో డీటీవో నిర్లక్ష్యంగా సమాధానం చెప్పి వెళ్లిపోవడంతో షోకాజ్ నోటీసు ఇచ్చినట్లు సమాచారం.

పిచ్చిమొక్కలతో నిండిన తుంగబంధం పంట కాల్వ

కాల్వ ఇలా.. పంటకు నీళ్లు పారేదెలా?

ఖానాపురం, జనవరి 4: పాకాల ఆయకట్టులో ప్రధాన పంట కాల్వలైన తుంగబంధం, సంగెం, జాలుబంధం, పస్నూరు పంట కాల్వల నిండా సిల్ట్ చేరడంతో పాటు పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. పాకాల సరస్సు నుంచి సాగునీరు విడుదల చేసినప్పటికీ పిచ్చిమొక్కల వల్ల చివరి ఆయకట్టుకు నీరందడం అసాధ్యమే. తక్షణమే సిల్ట్‌తోపాటు పిచ్చిమొక్కలను తొలగించాల్సిన అవసరం ఉంది. కాల్వలను శుభ్రం చేయకపోతే తీవ్ర ఇబ్బందులు పడే అవకాశం ఉందని అన్నదాతలు వాపోతున్నారు. దీంతోపాటు నాట్లు వేసుకోవడంతో తీవ్ర జాప్యం జరిగే ప్రమాదం ఉంది. ఇప్పటికే పాకాల ఆయకట్టులో యాసంగి వరినాట్లు ఆలస్యంగా ప్రారంభం అవుతున్నాయి. ఆలస్యమైతే వరి కోతల సమయంలో వర్షాలు పడే అవకాశం ఉంది. రైతుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని పాకాల పంట కాల్వలను వెంటనే శుభ్రం చేయాలని రైతులు కోరుతున్నారు.

నేడు పాకాల నీటి విడుదల

పాకాల ఆయకట్టు కింద యాసంగి సాగుకు ఆదివారం నీరు విడుదల చేయనున్నట్లు డీఈ రమేశ్ తెలిపారు. గత నెలలో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సమక్షంలో అధికారులు యాసంగి టైబందీ ఖరారు చేశారు. అయితే, పూర్తిస్థాయి ఆయకట్టుకు నీరందించాలని నిర్ణయించారు. ఇప్పటికే రైతులు నార్లు పోసుకున్నారు. ఈ నేపథ్యంలో నీటి విడుదలకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

బాల్యమిత్రుల ఆర్థిక సాయం

వర్ధన్నపేట(రాయపర్తి), జనవరి 4: వర్ధన్నపేట మండలంలోని కడారిగూడెం గ్రామానికి చెందిన దోపతి రవీందర్‌రెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కుటుంబ యజమాని అకాల మరణంతో పుట్టెడు దుఃఖంలో ఉన్న బాధిత కుటుంబానికి బాల్యమిత్రులు అండగా నిలిశారు. రవీందర్‌రెడ్డి భార్య దోపతి రజితతో కలిసి మండలకేంద్రంలోని సిద్ధార్థ ఉన్నత పాఠశాలలో 1995–96లో పదో తరగతి విద్యాభ్యాసం పూర్తిన తోటి స్నేహితులు రూ. 60 వేల ఆర్థిక సాయాన్ని శనివారం అందించారు. రజితతోపాటు ఆమె ఇద్దరు కుమార్తెలను పరామర్శించి ధైర్యం చెప్పారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్

SepTeK

★ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043, 9866584455.
NTW-326545

WANTED TELECALLERS

★ URGENT REQUIREMENT for ICICI HDFC AXIS INDUSIND BANK'S DSA PERSONAL LOANS EXPERIENCE AND FRESHER FEMALE TELE-CALLERS SALARY+INCENTIVES JOB LOCATION: HANAMKONDA, CONTACT: +91 9398286149.
NTW-7708

వృద్ధాశ్రమము

★హన్మకొండ వడ్డేపల్లి నందు ఆధునిక వసతులతో గత పది సంవత్సరాల నుండి 50 మంది వృద్ధులకు సేవలు అందిస్తూ నూతనంగా బ్లాకు అందుబాటులోకి తేవడం జరిగింది. సంప్ర: సెల్: 9848444020, 9110551507
NTW-326547

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

PLOTS FOR SALE

★Hyd. హయత్ నగర్, పెద్ద అంబర్‌పేట్, కొహెడ శ్రీమిత్ర, బాటసింగారం, తూప్రాన్‌పేట్, పోచంపల్లి శ్రీమిత్రలో ప్లాట్లు కొనబడును. No Brokers. 9553973999 / 6303049720.
NT-326614

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే

ప్రకటనల విభాగం: 9182777552

HANAMKONDA 9182777563 9182777961
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777135
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565

తల్లిదండ్రులతో రాకేశ్

తెలంగాణ స్పెషల్ పోలీస్‌గా రాకేశ్

నల్లబెల్లి, జనవరి 4: తెలంగాణ స్పెషల్ పోలీస్‌గా అనుముల రాకేశ్ ట్రైనింగ్ పూర్తి చేశాడు. మండలంలోని లెంకాలపల్లి గ్రామానికి చెందిన అనుముల సంపత్, స్వప్న దంపతుల కుమారుడు రాకేశ్ తెలంగాణ స్పెషల్ పోలీస్‌కు ఎంపికయ్యాడు. హైదరాబాద్ ఇబ్రహీంపట్నంలోని మూడో బెటాలియన్‌లో శిక్షణ పూర్తి చేశాడు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం పోస్టింగులు ఖరారు చేసింది. తనకు మామునూరు నాలుగో బెటాలియన్‌లో పోస్టింగ్ ఇచ్చినట్లు రాకేశ్ తెలిపాడు. ఈ సందర్భంగా నిరుపేద కుటుంబంలో జన్మించిన రాకేశ్ పట్టుదలతో చదివి పోలీస్ ఉద్యోగం సాధించినందుకు గ్రామస్తులు, బంధువులు అభినందించారు.

అన్‌మ్యాండ్‌కు తీవ్ర గాయాలు

సంగెం, జనవరి 4: విద్యుత్ శాఖలో అన్‌మ్యాండ్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్తుల కథనం ప్రకారం.. రాంచంద్రాపురం గ్రామానికి చెందిన వేల్పుల కొమ్మాలు విద్యుత్ శాఖలో అన్‌మ్యాండ్‌గా పని చేస్తున్నాడు. పెద్దతండాకు చెందిన బాలు లోహిత సబ్‌స్టేషన్‌లో ఆపరేటర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. బాలుకు సబ్‌స్టేషన్ సమీపంలో వ్యవసాయ భూమి ఉంది. తన బావి వద్ద విద్యుత్ మోటర్ వైర్లు తెగిపోయాయి. దీంతో శుక్రవారం సాయంత్రం తెగిపడిన వైర్లను స్తంభానికి చుట్టి రావాలని కొమ్మాలును బాలు కోరాడు. దీంతో అతడు మోటర్ వద్దకు వెళ్లి స్తంభం ఎక్కి కనెక్షన్ ఇస్తుండగా పైనే ఉన్న 11 కేవీ వైర్ కొమ్మాలుకు తాకడంతో విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా కాలిపోయాడు. వెంటనే బాధితుడిని ఎంజీఎం దవాఖానకు తరలించి, అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించారు.

నేటి నుంచి జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు

సంగెం, జనవరి 4: నేటి నుంచి సంగెంలో జిల్లాస్థాయి కబడ్డీ ఇంటర్ జోనల్ బాలబాలికల పోటీలు నిర్వహించనున్నట్లు కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలియా, కార్యదర్శి ముఖర్జీ సంయుక్త ప్రకటనలో తెలిపారు. సంగెం జడ్పీహెచ్‌ఎస్‌లో జరగనున్న పోటీల్లో క్రీడాకారులు పెద్ద మొత్తంలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

'అక్రమ అనుమతిని రద్దు చేయాలి'

ఖిలావరంగల్, జనవరి 4: అజంజాహి మిల్ కార్మిక భవనంలో అక్రమంగా ఇచ్చిన భవన నిర్మాణ అనుమతి, ఇంటి నంబర్‌ను రద్దు చేయాలని ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, కార్పొరేటర్ గుండేటి నరేందర్ కోరారు. శనివారం కలెక్టరేట్‌లో కలెక్టర్ సత్య శారద, జీడబ్ల్యూఎంసీలో కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడెను కలిసి వినతిపత్రాలు అందజేశారు. తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు.

పరికరాలకు మరమ్మతు చేయాలి

వరంగల్, జనవరి 4: పార్కుల్లోని ఓపెన్ జిమ్‌లలో చెడిపోయిన పరికరాలకు వెంటనే మరమ్మతులు చేయాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. శనివారం ఆమె డాక్టర్స్ కాలనీ, టెలికాం కాలనీ, ఎల్బీ నగర్ పార్కుల్లోని ఓపెన్ జిమ్‌లను పరిశీలించి సూచనలు చేశారు. కిషన్‌పురా, 49వ డివిజన్‌లోని రెవెన్యూ కాలనీల ప్రజలతో ఆమె మాట్లాడారు. అనంతరం కార్పొరేషన్ కార్యాలయంలో ఆమె వివిధ విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఐసీసీసీకి సంబంధించిన జీఐఎస్ మ్యాపింగ్ పనితీరును పరిశీలించాలని, ప్రతి కాంపోనెంట్స్ పనిచేసేలా స్మార్ట్‌సిటీ ప్రతినిధులు పర్యవేక్షించాలన్నారు.

బల్దియా ఎదుట 48 గంటల దీక్ష

వరంగల్, జనవరి 4: మున్సిపల్ కార్పొరేషన్‌లో పారిశుద్ధ్య కార్మికులుగా పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికులకు రూ. 26 వేల కనీస వేతనం చెల్లించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి రాగుల రమేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం గ్రేటర్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు చేపట్టిన 48 గంటల నిరసన దీక్షలను ఆయన ప్రారంభించారు.

కత్తితో అన్నపై తమ్ముడు దాడి

గిర్మాజీపేట, జనవరి 4: ఇంటి స్థలం విషయంలో అన్నపై తమ్ముడు కత్తితో దాడి చేసిన ఘటన శనివారం గిర్మాజీపేటలోని సత్యం కంప్యూటర్ వీధిలో జరిగింది. ఇంతెజార్‌గంజ్ సీఐ షుకూర్ కథనం ప్రకారం.. ఐలోని పాపయ్యకు చిరంజీవి, శ్రీనివాస్, శంకర్ కుమారులు ఉన్నారు. పాపయ్య ఎల్బీ నగర్‌లో తన 90 గజాల ఇంటి స్థలాన్ని పెద్దకొడుకు చిరంజీవికి తెలియకుండా శ్రీనివాస్, శంకర్ పేర గిఫ్ట్ రిజిస్ట్రేషన్ చేయించాడు. ఈ విషయం తెలుసుకున్న చిరంజీవి(65) తన తండ్రిని ప్రశ్నించాడు. చిన్నకుమారుడు శంకర్ ఆవేశంతో చిరంజీవి గొంతుభాగంలో కత్తితో పొడిచాడు. కుటుంబ సభ్యులు అతడిని దవాఖానకు తరలించారు. చిరంజీవి కొడుకు శివ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

గీత కార్మికుడికి తీవ్రగాయాలు

పర్వతగిరి, జనవరి 4: సోమారానికి చెందిన గీత కార్మికుడు నాళ్లం యాకాంబ్రం శనివారం తీవ్రంగా గాయపడ్డాడు. కల్లు తీసేందుకు తాటి చెట్టు ఎక్కుతుండగా జారి పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఆసుపత్రికి తరలించారు. గౌడ సంఘం నాయకులు అతడిని పరామర్శించారు.

ఎస్సైపై ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు

నెక్కొండ, జనవరి 4: కులం పేరుతో దూషించాడని ఆరోపిస్తూ నెక్కొండ ఎస్సై మహేందర్‌పై మండలంలోని పత్తిపాకకు చెందిన బానోత్ రవి ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు ఫిర్యాదు చేశాడు. బాధితుడి కథనం ప్రకారం.. అన్నదమ్ముల మధ్య గొడవ కారణంగా బానోత్ రవిని అన్న కుటుంబం దూషించింది. దీంతో రవి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. గత నెల 12న ఎస్సై తన చాంబర్‌లో రవిని కింద కూర్చోబెట్టి కులం పేరుతో దూషించి చెంపపై కొట్టాడు. సెల్‌ఫోన్‌లో రికార్డు చేసిన గొడవకు సంబంధించిన వీడియోను డిలీట్ చేసి బెదిరించాడు. దీంతో ఎస్సైపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ విషయమై ఎస్సై మహేందర్‌ను వివరణ కోరగా.. రవి చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదన్నారు.

కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

- **అంగన్‌వాడీ సిబ్బందికి రూ. 18 వేల వేతనం ఇవ్వాలి**
- **ఆటో కార్మికులకు రూ. 12 వేలు చెల్లించాలి**
- **బీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబుయాదవ్**

మాట్లాడుతున్న రాంబాబుయాదవ్

నర్సంపేట, జనవరి 4: కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికల సమయంలో ఉద్యోగ, కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని బీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబుయాదవ్ డిమాండ్ చేశారు. నర్సంపేటలో శనివారం బీఆర్టీయూ ఆధ్వర్యంలో ఉద్యోగ, కార్మికుల డివిజన్‌స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ ఉద్యోగ, కార్మికులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నేటికీ అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. తాము అధికారంలోకి వస్తే అంగన్‌వాడీలు, ఆయాలకు రూ. 18 వేల వేతనం ఇస్తూ రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. అలాగే, ఆటో కార్మికులకు రూ. 12 వేల వేతనం చెల్లిస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి సర్కార్ నేటికీ పట్టించుకోకపోవడం సరికాదన్నారు. అంతేకాకుండా సర్వశిక్షా అభియాన్ ఉద్యోగులు 28 రోజులుగా పెన్‌డౌన్ చేసి సమ్మె చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధి కనబర్చడం లేదని విమర్శించారు. ప్రభుత్వం హామీలు అమలు చేయకుంటే సమ్మె సైరన్ మోగిస్తామని హెచ్చరించారు. సమావేశంలో బీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల మారయ్య, అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు నల్లా భారతి, ఆశ కార్యకర్తల యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు సంతోష, బీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు, భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేశ్, హమాలీ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

జిల్లాలో వేర్వేరు కారణాలతో ఏడుగురు మృతి

నల్లబెల్లి/పర్వతగిరి/రాయపర్తి/నర్సంపేట/గీసుగొండ, జనవరి 4: జిల్లాలో వేర్వేరు కారణాలతో శనివారం ఏడుగురు మృతి చెందారు. నల్లబెల్లి మండలం రుద్రగూడెం పరిధి పెద్దతండాకు చెందిన అజ్మీరా వసంత(35) పురుగుల మందు తాగింది. దవాఖానకు తరలించేలోపే మృతి చెందింది. బోల్లోనిపల్లెకు చెందిన రాగుల రమేశ్(27) అనారోగ్యానికి గురికాగా కుటుంబ సభ్యులు ఎంజీఎం దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆయా కుటుంబాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు నల్లబెల్లి ఎస్సై గోవర్ధన్ తెలిపారు. అలాగే, పర్వతగిరి మండలం ఏనుగల్లుకు చెందిన మాసాని దిలీప్(20) తన ఇంట్లో మెట్లు కట్టుతుండగా, ఐరన్ రాడ్‌ను బయట నుంచి తీసుకొస్తున్నాడు. ఈ క్రమంలో పైన ఉన్న 11 కేవీ లైన్‌కు తాకడంతో తీవ్రంగా గాయపడిన అతడిని దవాఖానకు తరలించారు. ఈ క్రమంలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై ప్రవీణ్ తెలిపారు. వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలోని భవానీకుంట తండాకు చెందిన సపావత్ నరేశ్(20) డిగ్రీ విద్యాభ్యాసం పూర్తి చేశాడు. ఉన్నతంగా చదవాలనే కోరిక బలంగా ఉన్నప్పటికీ ఆర్థిక పరిస్థితులు అనుకూలించక ఇంట్లో డిసెంబర్ 15న గడ్డి మందు తాగాడు. ప్రభుత్వ దవాఖానలో చేర్పించగా, చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. అంతేకాకుండా కేసముద్రం మండలం చెట్లముప్పారం గ్రామానికి చెందిన కదిరె అనిల్(40)–చందన దంపతులు నర్సంపేటలో ఉంటున్నారు. ఈ నెల 1న అనిల్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొనగా గాయపడ్డాడు. వరంగల్ ఎంజీఎం దవాఖానలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. అలాగే, నర్సంపేట మండలం ముత్యాలమ్మతండా పరిధిలోని జంగాలపల్లితండాకి చెందిన భూక్యా బాలు కుమారుడు సుమన్(30)–కల్యాణి దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. గత నెల 31న కల్యాణి పుట్టింటికి వెళ్లడంతో సుమన్ ఈ నెల 2న క్రిమిసంహారక మందు తాగాడు. కుటుంబ సభ్యులు ఎంజీఎంహెచ్‌కు తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడని ఎస్సై గూడ అరుణ్ కుమార్ తెలిపారు. గీసుగొండ మండలం ఎలుకుర్తికి చెందిన బొల్లు సుభద్ర(55) పురుగుల మందు తాగింది. ఎంజీఎంహెచ్‌కు తరలించగా, చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు సీఐ మహేందర్ తెలిపారు.

అంధులకు సేవ చేయడం అభినందనీయం

- **గ్రేటర్ కార్పొరేషన్ కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే**
- **ఘనంగా లూయీ బ్రెయిలీ జయంతి**

విద్యార్థులకు కేక్ తినిపిస్తున్న గ్రేటర్ కమిషనర్

పోచమ్మమైదాన్, జనవరి 4: అంధ విద్యార్థులకు సేవ చేయడం అభినందనీయమని గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ కమిషనర్ డాక్టర్ అశ్వినీ తానాజీ వాకడే అన్నారు. లూయీ బ్రెయిలీ 216వ జయంతి సందర్భంగా వరంగల్ ఆటోనగర్‌లోని లూయీ ఆదర్శ అంధుల పాఠశాలలో శనివారం వేడుకలు నిర్వహించారు. పాఠశాల వ్యవస్థాపకుడు దివంగత నలివెల కుమారస్వామి సతీమణి కల్యాణి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆమె హాజరై అంధ విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేసి పిల్లలకు తినిపించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నిర్వాహకులు పాఠశాలలో మంచి వసతులు కల్పిస్తున్నారని కొనియాడారు. పాఠశాలకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. కేయూ ఈసీ మెంబర్ డాక్టర్ కె.అనితారెడ్డి మాట్లాడుతూ పాఠశాల ప్రారంభం నుంచి విద్యార్థులతో తనకు మంచి అనుబంధం ఉందన్నారు. డీఎంహెచ్‌వో డాక్టర్ సాంబశివరావు మాట్లాడుతూ పిల్లలు వైకల్యాన్ని అధిగమించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బస్వరాజు కుమారస్వామి, మాజీ కార్పొరేటర్ యెలగం లీలావతీ సత్యనారాయణ, దాత జెరోమ్ ఫాదర్, కైలాస్‌యాదవ్, డెమో అనిల్‌కుమార్, టీవీ అశోక్‌కుమార్, డాక్టర్ తుమ్మ ప్రభాకర్‌రెడ్డి, ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు లావణ్య, మల్లికాంబ మనోవికాస కేంద్రం నుంచి రామలీల, బన్ను మనోవికాస కేంద్రం నుంచి కిరణ్మయ్, అతిథి ఆశ్రమం నుంచి సుజాత, రాజనాల శ్రీహరి, కుమారస్వామి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. అలాగే, మూడు దశాబ్దాలు అంధ విద్యార్థులకు సేవలు అందించిన దివంగత నలివెల కుమారస్వామి జ్ఞాపకార్థం అంధుల పాఠశాలలో ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ల్యాదాల్ల శరత్, సామాజిక సేవా సంస్థ వ్యవస్థాపకుడు ఎలుకపల్లి శ్రీధర్, మణికంఠ పాల్గొన్నారు.

సీసీఐ పత్తి కొనుగోళ్లు యథావిధిగా కొనసాగించాలి


మంత్రికి వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు

సంగెం, జనవరి 4: సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లను యథావిధిగా కొనసాగించాలని తెలంగాణ రైతు సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసి వినతిపత్రం అందజేశారు. నీతి ఆయోగ్ సూచనల పేరుతో సీసీఐ కొనుగోళ్లు నిలిపివేసి పత్తికి ధర లోటు చెల్లింపు పథకాన్ని మన రాష్ట్రంలో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేయాలని కేంద్రం చూస్తున్నదని ఆరోపించారు. దీన్ని అడ్డుకొని సీసీఐ కొనుగోళ్లు యథావిధిగా కొనసాగేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ మోర్తాల చందర్‌రావు, నాయకులు చంద్రశేఖర్, రవీందర్, గోనె కుమారస్వామి, శంకర్‌రావు, జెండా రాజేశ్, సంపత్‌కుమార్, భాషిపాక రమేశ్, నర్సయ్య, తిరుపతి పాల్గొన్నారు.

మొన్న తండ్రి.. నిన్న కుమారుడు..

- **15 రోజుల వ్యవధిలో ఇద్దరు మృతి**
- **ఇద్దరికీ తలకొరవి పెట్టిన చిన్న కుమారుడు**

సాయిరాం(ఫైల్), సంపత్(ఫైల్)

చెన్నారావుపేట, జనవరి 4: అనారోగ్య కారణాలతో రెండు వారాల వ్యవధిలోనే తండ్రి, కుమారుడు మృతి చెందిన ఘటన మండలకేంద్రంలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన చిరుతం సంపత్–మాధవి దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు సాయిరాం(20) కొద్ది నెలల క్రితం అనారోగ్యానికి గురయ్యాడు. వైద్య పరీక్షలు చేయించగా బ్లడ్ క్యాన్సర్‌గా వైద్యులు నిర్ధారించారు. అప్పటి నుంచి తీవ్ర మనోవేదనకు గురైన తండ్రి సంపత్ బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై ఇటీవల మరణించాడు. తండ్రి మరణించిన 15 రోజుల్లోనే సాయిరాం హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ శనివారం కన్నుమూశాడు. భర్త, కుమారుడి మరణంతో మాధవి, చిన్న కుమారుడు శివ రోదనలు మిన్నంటాయి. కాగా, నాడు తండ్రికి తలకొరివి పెట్టిన శివ నేడు అన్నకు అన్నీ తానై అంత్యక్రియలు నిర్వహించిన తీరు స్థానికులను కలచివేసింది.

డీసీఎం డ్రైవర్ల ధర్నా

వరంగల్‌చౌరస్తా, జనవరి 4: రైల్వే వ్యాగన్ షెడ్ నుంచి యూరియా తరలింపులో డీసీఎం వాహనదారులకు అవకాశాలు కల్పించకుండా లారీ ఓనర్స్ ఇబ్బందులకు గురి చేయడాన్ని నిరసిస్తూ డీసీఎం వాహన యజమానులు, డ్రైవర్లు వెంకటరమణ జంక్షన్‌లో శనివారం మధ్యాహ్నం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీఎం ఓనర్స్ అండ్ డ్రైవర్స్ అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ ఏటా జూన్‌లో వర్షాకాలం సమయంలో మాత్రమే రవాణాకు అవకాశాలు కల్పించి, జనవరిలో లారీ ఓనర్స్ ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. సీరియల్ ప్రకారం డీసీఎం వాహనాలకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.

డైరీ ఆవిష్కరిస్తున్న అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి

మెరుగైన సేవలు అందించాలి

కాశీబుగ్గ, జనవరి 4: వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు వచ్చే రైతులకు అడ్తి, ఖరీదు వ్యాపారులు మెరుగైన సేవలు అందించాలని అడిషనల్ కలెక్టర్ సంధారాణి అన్నారు. లక్ష్మీపురంలోని చాంబర్ కార్యాలయంలో శనివారం చాంబర్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి అధ్యక్షతన 2025 డైరీ, క్యాలెండర్ ఆమె ఆవిష్కరించారు. రైతుల అభివృద్ధే ధ్యేయంగా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో జేడీఎం శ్రీనివాస్, డీడీఎం ఒడితల పద్మజ, డీఎంవో కలకొట్ల సురేఖ, కార్యదర్శి పోలెపాక నిర్మల, వరంగల్ జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తోట సంపత్‌కుమార్, చాంబర్ మాజీ అధ్యక్షుడు కటకం పెంటయ్య, కే కుమారస్వామి, చాంబర్ ప్రధాన కార్యదర్శి మడూరి వేదప్రకాశ్ పాల్గొన్నారు.

పర్యటన జయప్రదం చేయాలి

గీసుగొండ, జనవరి 4 : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదివారం మొగిలిచెర్ల పర్యటనను విజయవంతం చేయాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి కోరారు. గ్రేటర్ వరంగల్ 15వ డివిజన్ మొగిలిచెర్లలో విద్యుత్ ఉపకేంద్రాలకు నేడు శంకుస్థాపన చేయనున్నందున ఎమ్మెల్యే శనివారం ఏర్పాట్లను పరిశీలిచారు. అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచించారు. అనంతరం ఆయన గీసుగొండలోని శ్రీలక్ష్మీనర్సింహ స్వామి జాతర పోస్టర్‌ను ఆవిష్కరించారు.

మొగిలిచెర్లలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

కార్పొరేటర్‌కు పత్రాలు అందజేస్తున్న బాధితులు

దరఖాస్తుదారుల అయోమయం

కరీమాబాద్, జనవరి 4: ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారి పేర్లు ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో రాకపోవడంతో అయోమయానికి గురవుతున్నారని వరంగల్ 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి అన్నారు. పలువురు బాధితులు శనివారం ఉర్సులో కార్పొరేటర్‌ను కలిసి జిరాక్స్ ప్రతులు అందించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ డివిజన్ పరిధిలో సుమారు 200 మంది పేర్లు సంబంధిత యాప్‌లో లేవన్నారు. ఇంటి నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకున్న వారంతా ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. జిల్లా అధికారులను కలిసి న్యాయం జరిగేలా చూస్తానన్నారు.

నర్సంపేట : మోకాళ్లపై నిలబడి నిరసన తెలుపుతున్న కార్మికులు

మోకాళ్లపై నిల్చొని హమాలీల నిరసన

నర్సంపేట/కాశీబుగ్గ, జనవరి 4: పెంచిన కూలీ రేట్ల జీవోను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని కోరుతూ శనివారం పట్టణంలో హమాలీలు మోకాళ్లపై నిల్చొని వినూత్నంగా నిరసన తెలిపారు. కార్మికుల సమ్మెకు తెలంగాణ రాష్ట్ర భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గన్నారపు రమేశ్, ఏఐటీసీ రాష్ట్ర అధ్యక్షుడు గుంపెల్లి మునీశ్వర్ సంఘీభావం ప్రకటించారు. అలాగే, వరంగల్ ఎనుమాముల మార్కెట్ పరిధిలోని సివిల్ సప్లయ్ గోదాం వద్ద 4వ రోజు నిరవధిక సమ్మెను కొనసాగించారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు పనాస ప్రసాద్, రాంబాబు, దామెర కృష్ణ, బండి లింగమూర్తి, కంచె రవి, గంద్రకోట చంద్రమౌళి, కుక్కల రాజు పాల్గొన్నారు.

9న హెసీఎల్‌లో జాబ్ మేళా

గిర్మాజీపేట, జనవరి 4: హనుమకొండలోని కాకతీయ గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో ఈ నెల 9న ఇంటర్మీడియట్ విద్యార్థులకు జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి డాక్టర్ శ్రీధర్ సుమన్ ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్ల ఆధ్వర్యంలో హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ వారు నిర్వహించనున్న టెక్ బీ ప్రోగ్రాం కోసం 2023–2024లో ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు, 2025లో పూర్తి చేయనున్న ఎంపీసీ, ఎంఈసీ, సీఈసీ, బైపీసీ వొకేషన్ కంప్యూటర్స్ విద్యార్థులకు ఉద్యోగావకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఎంపీసీ, ఎంఈసీ, సీఈసీ, వొకేషనల్ కంప్యూటర్స్‌లో 75 శాతం, మ్యాథమెటిక్స్‌లో 60 శాతం మార్కులు సాధించిన విద్యార్థులు అర్హులన్నారు. సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతులు, పాస్ ఫొటో, ఆండ్రాయిడ్ మొబైల్‌తో రావాలని సూచించారు. వివరాలకు 7981834205 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ద్విచక్ర వాహనదారులకు పూలు అందజేసున్న పోలీసులు

రోడ్డు భద్రతా ప్రమాణాలు పాటించాలి

దుగ్గొండి, జనవరి 4: ద్విచక్ర వాహనాలు హెల్మెట్ ధరించడం వల్ల రోడ్డు ప్రమాదాలను నివారించొచ్చని ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా గిర్నిబావిలో వరంగల్–నర్సంపేట రహదారిపై ద్విచక్ర వాహనదారులకు ట్రాఫిక్ నియంత్రణ, నిబంధనలు, హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలను తెలియజేశారు. అనంతరం వారికి పూలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

పిల్లలు డ్రైవింగ్ చేస్తే తల్లిదండ్రులపై కేసు

నల్లబెల్లి: రోడ్డు ప్రమాదాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఎస్సై గోవర్ధన్ సూచించారు. మండలకేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. పల్లెలు, పట్టణాలు, జాతీయ రహదారులపై వాహనాలు నడిపేటప్పుడు రోడ్డు సేఫ్టీ నియమాలు పాటించాలని కోరారు. విద్యార్థులు డ్రైవింగ్ చేయడం మంచిది కాదన్నారు. పిల్లలు డ్రైవింగ్ చేసి పట్టుబడితే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో సాంబశివరావు

యూపీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ

ఖిలావరంగల్, జనవరి 4: ఖిలావరంగల్ యూపీహెచ్‌సీని డీఎంహెచ్‌వో డాక్టర్ సాంబశివరావు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రిజిస్టర్‌ను పరిశీలించారు. ఎల్టీ రాజేశ్ గత ఏడాది ఏప్రిల్ నుంచి, ఫార్మసిస్ట్ స్పందన గత నెల నుంచి విధులకు హాజరు కావడం లేదని గుర్తించారు. వీరికి మెమోలు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే, డిప్యూటేషన్‌పై ఎంజీఎంలో పని చేస్తున్న భాగ్యలక్ష్మిని తిరిగి యూపీహెచ్‌లోకి తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ దవాఖానలో ప్రసవాలు జరిగేలా ప్రోత్సహించాలన్నారు. ఆయన వెంట డెమో అనిల్‌కుమార్, వైద్యాధికారి సుధ, ఏఎన్ఎం రేష్మ, అకౌంటెంట్ అభిషేక్, ఎంఎన్‌వో మాధవ ఉన్నారు.

'తండాల జోలికొస్తే ఊరుకునేది లేదు'

చెన్నారావుపేట, జనవరి 4: తండాల జోలికొస్తే తరిమికొడతామని ఎన్‌టీవీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బానోత్ రామన్ననాయక్ హెచ్చరించారు. మండలంలోని పత్తినాయక్‌తండాలో శనివారం ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం తండాలను జీపీలుగా మార్చి అభివృద్ధి చేసిందన్నారు. వాటిని గ్రామాల్లో విలీనం చేయాలని చూస్తే అడ్డుకుంటామని హెచ్చరించారు. విలీనానికి దొంగ తీర్మానం చేయించిన ఎంపీడీవోపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట టీఎన్ఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి సుభాష్‌నాయక్, కల్యాణ్‌నాయక్, మంగీలాల్, మురళీనాయక్, శంకర్ పాల్గొన్నారు.

గుప్తనిధుల కోసం తవ్వకాలు

ఖానాపురం, జనవరి 4: మండలంలోని అశోక్‌నగర్‌లో శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు గుప్తనిధులు కోసం తవ్వకాలు జరిపారు. విద్యుత్ సబ్‌స్టేషన్ వెనుక మొదట క్షుద్రపూజలు చేశారు. అనంతరం తవ్వకాలు జరిపారు. శనివారం ఉదయం గుర్తించి గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిపినట్లు చర్చించుకుంటున్నారు.

నిజాయితీతో ప్రజలకు సేవలు అందించాలి

గిర్మాజీపేట, జనవరి 4: పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులకు నిజాయితీతో సేవలు అందించాలని ఏసీపీ నందిరాంనాయక్ సూచించారు. శనివారం ఇంతెజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. సిబ్బంది కిట్ ఆర్టికల్స్‌ను పరిశీలించారు. సీసీ కెమెరాలు, సన్నిహిత సిబ్బంది పనితీరును సీఐ ఎంఏ షుకూర్‌ను అడిగి తెలుసుకున్నారు.